క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

మక్కువ: మండలంలోని ములక్కాయవలసలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులవీణ ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ వీధుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ పీఓ ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

పాలకొండ: మండలంలోని ఎం.సింగుపురం వరకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం సర్వీసులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామం నుంచి జిల్లా కేంద్రం పార్వతీపురం వరకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని గ్రామానికి చెందిన రామినాయుడుతో పాటు పలువురు ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశారు. సర్వీసు పునరుద్ధరణ వల్ల ఎం.సింగుపురంతో పాటు జంపరకోట, మల్లీవీడు, డోలమడ, పాట్లి, అవలంగి, వెంకటాపురం, అక్కిరాజుపేట, చంద్రయ్యవలస తదితర గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

అనారోగ్యంతో గిరిజన విద్యార్థి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తాడంగి వంశీ(12) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో గ్రామ దేవత పండుగ ఉండటంతో ఈనెల 23న వంశీని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. రాత్రి అందరూ కలిసి భోజనం చేశాక పడుకున్నారు. 11 గంటల సమయంలో ఆకలి వేస్తోందని మరోసారి అన్నం తిని పడుకున్నాడు. తల నొప్పి పెడుతుందని కొద్ది సేపటి తరువాత లేచి నీరు తాగి పడుకున్నాడు. అకస్మాత్తుగా నోరు, ముక్కు నుంచి నురగలు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యార్థి కుటుంబ సభ్యులు వసతిగృహ డిప్యూటీ వార్డెన్ అప్పారావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన గ్రామానికి వెళ్లి పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు ఆయన చెప్పారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..

పాలకొండ/పాలకొండ రూరల్: మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వరాదని సీఐ మీసాల చంద్రమౌళి సూచించారు. పాలకొండ –శ్రీకాకుళం, రాజాం రహదారుల్లో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులతో వచ్చే వాహనాలను నిలుపుదల చేసి వాటి ధ్రువపత్రాలు పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై అపరాధ రుసుం విధించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రలకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపే క్రమంలో ఏవైనా ప్రమాదాలు జరిగితే వాహన యజమానితో పాటు మైనర్ల తల్లిదండ్రులపై కేసులు నమోద చేస్తామని తెలిపారు.

ఉత్తములను అనుసరించాలి

రేగిడి: మనుషులంతా ఉత్తములను అనుసరించి, మంచిమార్గంలో పయనించాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గీతాశ్రమంలో గొర్లె దామోదరా వు అధ్యక్షతన ఆదివారం జరిగిన దివ్య జీవన సత్సంగ సమావేశంలో పాల్గొన్న ఆయన మంచి కార్యాన్ని ఎటువంటి విఘ్నాలు లేకుండా పూర్తి చేసిన వారే ఉత్తములని, వారి జీవితం, వారు జీవించిన విధానం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మనుషుల్లో ఉత్తములు, మధ్యములు, అధములు ఉంటారని, అందరి కంటే గొప్పవారు ఉత్తములని, వీరు ఏ తలంపు చేపట్టినా విజయం ఉంటుందని, అనుకున్నది సాధిస్తారన్నారు. మధ్యములు ఏ కార్యమూ చేయలేరని, ఆరంభసూరత్వమేనని మధ్యలో పనిని విడిచిపెట్టేస్తారన్నారు. అధములు నీచులతో సమానమని, వీరు పూర్తిగా పిరికితనంతో వ్యవహరిస్తారని, ఏ మంచి కార్యాన్ని అసలు తలంచరన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తములు అనుసరించిన జీవన విధానం పాటిస్తూ ఉత్తమోత్తములుగా వెలుగొందాలన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జి.దామోదరరావు, జి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మెహర్‌బాబా జయంతి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో అవతార్ మెహర్ బాబా 130వ జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో మెహర్‌బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం బాబా మందిరం వద్ద భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు.

ఆంగ్లంపై భయం పోగొట్టేందుకు కృషి

రాజాం సిటీ: విద్యార్థులకు ఆంగ్లంపై ఉన్న భయం పోగొట్టేందుకు కృషి చేస్తున్నామని ఫోరం ఆఫ్ ఇంగ్లిష్ టీచర్స్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.అచ్యుత్‌కుమార్, ఆర్.వి.జె.నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న 32 పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, పదజాలానికి సంబంధించి, 80 మార్కులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల్లో ఆంగ్లంపై నెలకొన్న భయం వీడడంతో పాటు అధిక మార్కులు సాధించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

సంక్షేమం, అభివృద్ధే రాజన్న అజెండా..

- నియోజకవర్గంలో రూ. 1300 కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం


టిడ్కో ఇంటిలో పాలుపొంగిస్తున్న మంత్రి పీడిక రాజన్నదొర (ఫైల్)

సాలూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా స్థానిక ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర పాలన సాగిస్తున్నారు. గ్రామసందర్శనలు, గడప గడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారు. ముఖ్యమంత్రి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 8,14,539 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా 1,628 కోట్ల రూపాయలకు పైగా లబ్ధి చేకూర్చారు. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా నగదు జమ కావడంతో ఎక్కడా అవినీతి చోటు చేసుకోలేదు. అలాగే నియోజకవర్గంలో ఇంతవరకు కనీవినీ ఎరుగని రీతిలో సుమారు 1300 కోట్ల రుపాయలతో ప్రభుత్వ భవనాలు, వంతెనలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా గిరిశిఖర గ్రామాలకు రహదారి నిర్మాణాలు చేపడుతున్నారు. పంచాయతీరాజ్ (పీఆర్ఐ, పీఐయూ), ఆర్అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల ద్వారా సుమారు 15,857 పనులు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు సుమారు 7 వేల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా వివిధ దశలలో ఉన్నాయి. ఇటీవల 1056 మందికి టిడ్కో గృహాలను ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అందించిన విషయం తెలిసిందే.


శరవేగంగా జరుగుతున్న వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం

అంతా జగనన్న చలువే..

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించడం వల్ల ప్రజలందరికీ మేలు జరుగుతోంది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడం జగనన్న చలువే. ఆయన సూచనలు, సలహాలు, సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించగలుగుతున్నాను. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతూ, మాది చేతల ప్రభుత్వమని నిరూపించుకోగలిగాం.

– పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

వేగవంతంగా ఇంటింటి కుళాయి పనులు


యంత్రాలతో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండలంలోని చినభోగిలిలో ఇంటింటి కుళాయి పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్. పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన గ్రామంలో సర్పంచ్ కె.రాధ పర్యవేక్షణలో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం రూ.27 లక్షలు మంజూరు చేసిందని తద్వారా సుమారు 500 ఇళ్లకు ట్యాప్‌లు అమర్చనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే మెయిన్ రోడ్డు మినహా మిగతా వీధుల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు బి.శ్రీరాములునాయుడు, ఉపసర్పంచ్ గణపతి, మాజీ ఎంపీటీసీ చుక్క వెంకటనాయుడు, మాజీ సర్పంచ్ జి.సూర్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎయిమ్‌ఫర్ సేవ ఛాత్రాలయ వార్షికోత్సవం


డిజిటల్ సిస్టంను ప్రారంభిస్తున్న స్థైర్యానంద సరస్వతి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో గల స్వామి సచ్చిదానందసరస్వతి సేవాశ్రమం (ఎయిమ్‌ఫర్‌సేవ)లో ఆదివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడకు చెందిన ప్రణవాశ్రమం పీఠాధిపతి స్థైర్యానంద సరస్వతి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు 16వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. స్వామి దయానంద సరస్వతి పర్యవేక్షణలో నియమించిన కమిటీ సభ్యులు ఎయిమ్‌ఫర్ సేవ ఛాత్రాలయం నిర్వహిస్తూ ఈ ప్రాంతంలో తల్లిదండ్రులు కోల్పోయి విద్యపట్ల ఆసక్తి కల్గిన వారికి 15 సంవత్సరాలుగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో ఉచితంగా విద్యనేర్పించడంతో పాటు, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుడివాడ పీఠాధిపతి స్థైర్యానంద సరస్వతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎయిమ్‌ఫర్ సేవ ఛాత్రాలయాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా పేదింటి పిల్లలను దాతల సహకారంతో విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి పిల్లలను ఎంపిక చేసి ఆశ్రయం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యావేత్త, దాత బెవర రాంబాబు సమకూర్చిన ఎడ్యుకేషన్ సిస్టం 4.0 ప్రొజెక్టర్‌ను పిల్లలకు విరాళంగా అందజేశారు. ప్రస్తుత విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఛాత్రాలయ విద్యార్థులకు డిజిటల్ విద్యనందించడానికి, ఉద్యోగాల నిమిత్తం జరిగే పోటీ పరీక్షలకు ఉపయో గించే డిజిటల్ సిస్ట అందజేసిన రాంబాబును అభినందించారు. అనంతరం కమిటీలో కొత్తగా నియమించిన సభ్యులు రెడ్డి దామోదరరావు,ఈదుబిల్లి జగన్నాథం, శిగడం శ్రీనివాసరెడ్డిలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ నల్ల సురేష్, కమిటీ ప్రతినిధి పుల్లెల శ్రీనివాసరావు, అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో..

ఒకటవ తరగతిలో 25శాతం సీట్లు

- మార్చి 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురంటౌన్: విద్యాహక్కు చట్టం–2009, సెక్షన్ 12(1)సి ప్రకారం 2023–24 విద్యా సంవత్సరంలో అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశం కోసం 25శాతం సీట్లు కేటాయించారని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, పార్వతీపురం మండల విద్యాశాఖాధికారి, రాష్ట్ర ఎంఈఓ1 అసోసియేషన్ అధ్యక్షుడు సామల సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 63 ప్రకారం ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో అనాథ పిల్లలకు ఐదు శాతం, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, బీసీ మైనారిటీ, ఓసీలకు ఆరుశాతం కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో రూ.1,44,000 లోపు ఆదాయం ఉన్న కుటుంబాల విద్యార్థులు ఈ సీట్ల కోసం మార్చి 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థుల ఆధార్ ద్వారా సంబంధిత పోర్టల్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని, పాఠశాలకు ఒకటి నుంచి మూడు కిలోమీటర్ల లోపు నివాసం ఉంటున్న వారికి ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు.

రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే ఎంఈఓ, డీఈఓ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సీతంపేట: విద్యార్థులు ఆరోగ్యం, చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, కేజీబీవీని ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల కోసం వండిపెట్టిన భోజనాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని వంట సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులకు అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలని, వసతి గృహాన్ని శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ విద్యాలయంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: మండలంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో వసతిగృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులివ్వడంతో పాటు ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలున్నా మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి విద్యార్థులు వచ్చి వైద్య సేవలు పొందవచ్చని, విద్యార్థులు రాలేని పరిస్థితి ఉంటే తాము వచ్చి వైద్య సేవలందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ప్రిన్సిపాల్ ఈశ్వరరావు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న కారణంగా విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్ శర్మ, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సరికాదు

- వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి లిల్లీ పుష్పనాథం


లిల్లీపుష్పనాథం

పాలకొండ: స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిపై కొంత మంది కావాలనే బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎద్దు లిల్లీపుష్పనాథం అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీతి, నిజాయితీతో ప్రజాసేవ చేస్తున్న ఎమ్మెల్యే కళావతిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ.. ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ఆమె ఎంతో కృషిచేస్తున్నారని అన్నారు. గతంలో తాను పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఎమ్మెల్యే కళావతి అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రస్తుతం పాలకొండ పట్టణంలో సుమారు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. డంపింగ్ యార్డు సమస్యపై పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. నిజాయితీకి మారుపేరుగా ఉన్న కళావతిపై కొంత మంది ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తే సహించేది లేదని, ఆమెపై బురదజల్లేందుకు ప్రయత్నించేవారికి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..


విద్యార్థి ఇంటికి వెళ్ల సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: పదో తరగతి విద్యార్థుల పట్ల మండలంలోని చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. హెచ్‌ఎం సూచనల మేరకు ఉపాధ్యాయులు రెండు బృందాలుగా ఏర్పడి రాత్రి పూట ఇంటి వద్ద విద్యార్థులు ఎలా చదువుతున్నారో పరిశీలిస్తున్నారు. ఆదివారం గ్రామంలోని పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షలు దగ్గరపడినందున సమయం వృథా చేయకుండా చదువుకోవాలని

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే జోగారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలో జరుగుతున్న సామాజిక పరమైన అభివృద్ధి పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీతానగరం మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి పనుల పరిశీలన, సందర్శన, పరామర్శ చేశారు. ఈ సందర్భంగా బగ్గందొరవలస గ్రామానికి చెందిన టి.రామారావు కుటుంబాన్ని సందర్శించి పెళ్లిఅయిన నూతన వధూవరులను అభినందించారు. అనంతరం అదేగ్రామంలో ఇటీవల మృతి చెందిన ఉపసర్పంచ్ కె.నిర్మల కుటుంబాన్ని పరామర్శించారు. ఈ నేపథ్యంలో పలు గ్రామాల నుంచి ఇక్కడికి చేరకున్న వైఎస్సార్ సీపీ నాయకులు చేయిస్తున్న అభివృద్ధి పనులు గురించి వారితో మాట్లాడుతూ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో జరుగుతున్న సామాజిక పరమైన అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంబాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు చిట్టిరాజు, బగ్గందొరవలస, బళ్లకృష్ణాపురం, చినభోగిలి, కొత్తవలస గ్రామాల సర్పంచ్‌లు నారాయణరావు, తిరుపతినాయుడు, శ్రీనివాసరావు, ఆర్ అనిత, భోగి శంకరరావు, బక్కు శ్రీనివాసరావు, చుక్క వెంకటనాయుడు, గెడ్డలుప్పి, తామరఖండి ఎంపీటీసీలు కె.సత్యనారాయణ, వై.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు టి.రామారావు, కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ దాసరి సింహాచలం, ఉపసర్పంచ్ బి.జగన్నాథం, పీఏసీఎస్ చైర్మన్ ఎం.మన్మథరావు పాల్గొన్నారు.


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

పార్వతీపురం పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలోని 6వ వార్డు పరిధిలో నిర్మాణం పూర్తయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని చెప్పారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు సీఎం జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, స్థానిక కౌన్సిలర్ మజ్జి పారినాయుడు, పి.జయంతి, బొత్స ఆనంద్, కన్వీనర్ చెరుకుబిల్లి సదానందం, మేరువ వెంకంటరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎం పరిశీలన

బొబ్బిలి: అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా ఉన్న పలు రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ పథకానికి ఎంపికైన రైల్వేస్టేషన్లలో బొబ్బిలి రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఈ మేరకు ఇక్కడి స్టేషన్ అభివృద్ధి పనులను వర్చువల్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో జరుగుతున్న ఏర్పాట్లను రైల్వే డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ఆదివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం 11.40 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రైల్వే చీఫ్ ఇంజినీర్ ఎ.కె.పాండే, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పాల్గొంటారన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ పాలన


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషిచేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థిక బలోపేతానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదించాలని, వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిఖబడి సర్పంచ్ కోట రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బడే మన్మథనాయుడు, ఉపసర్పంచ్ భార్గవనాయుడు, గ్రామపెద్దలు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేసవిలో జీవాలు జాగ్రత్త..


గొర్రెల మంద

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో ఉష్ణోగ్రతలు పెరగడంతో గొర్రెల్లో వివిధ రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ మాణిక్యరావు సూచించారు. సీజనల్ వ్యాధులపై జీవాల పెంపకందారులు అవగాహన కలిగి ఉండటంతో పాటు వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా జీవాలను కాపాడుకోవచ్చని అంటున్నారు.

ఈ వ్యాధులతో ప్రమాదం..

జీవాల్లో సూక్ష్మజీవుల సంక్రమణ ద్వారా ప్రస్తుత సీజన్‌లో చిటుకు వ్యాధి(ఈటీ), అంత్రాక్స్ లేదా నల్లజాడ్యం, ఊపిరితిత్తుల్లో నెమ్ము లేదా నెమోనియా, పొగరాళ్ల లేదా బురద పుండ్లు, మితువకాళ్లు, గొంతువాపు వ్యాధుల సంభవించే అవకాశం ఉంది. గాలికుంటు, నీలి నాలిక, బొబ్బరోగం, అమ్మతల్లి, నోటిపుండ్లు వంటివి వైరస్ వ్యాధులు ఒకదాని నుంచి మరోదానికి వ్యాపించడం ద్వారా మందలోని జీవాలన్నీ వ్యాధిబారిన పడే ప్రమాదం ఉంది.

ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త..

వేసవిలో తేలికపాటి వర్షాలు కురిసేటప్పుడు క్లాస్ట్రీడియం జాతి సూక్ష్మజీవుల వలన ఎక్కువ ప్రమాదం చోటుచేసుకుంటుంది. బలిష్ఠంగా, ఆరోగ్యంగా ఉండే గొర్రెలు ఒక్కసారిగా ఎగిరిపడి కొట్టుకుని మరణించడం, కడుపును కాళ్లతో తన్నడం, కడుపు ఉబ్బడం, నల్లగా దుర్వాశన వచ్చే పారుడు, నోటి నుంచి నురగ రావడం, ఫిట్స్ వంటి లక్షణాలను గమనించవచ్చు. పెంపకందారులు ఈ తరహా లక్షణాలను గుర్తిస్తే తక్షణమే పశువైద్యులను సంప్రదించి చికిత్స అందించాలి.

నివారణ చర్యలు..

ఆక్సిట్రెటాసైక్లిన్ మందును 5–10 మిల్లీగ్రాములు ఒక కిలో బరువుకు లెక్కకట్టి గొర్రెలకు అందించాలి. 50 మిల్లీగ్రాముల పొటాషియం పర్మాంగనేట్ 100 మిల్లీల నీటిలో కలిపి తాగించాలి. రోగ నియంత్రణకు టీకాలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లో ఈ టీకాలను ఉచితంగా అందిస్తారు. మూడు మాసాల వయస్సు నిండిన గొర్రె పిల్లలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు ఇవ్వాలి. మొదటి టీకా ఇచ్చిన 15 రోజుల తరువాత బూస్టర్ డోస్ ఇవ్వాల్సి ఉంటుంది. ఏటా మే నెల మొదటి వారంలో క్రమం తప్పకుండా అవసరమైన టీకాలు వేయించాలని వైద్యులు సూచిస్తున్నారు.